క్లుప్తంగా

25 నుంచి ఉచిత శిక్షణ

జడ్చర్ల టౌన్: పదోతరగతి చదవబోయే విద్యార్థులకు ఈ నెల 25 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అవోపా అధ్యక్షుడు ఎలిశెట్టి మురళీకృష్ణ సోమవారం తెలియజేశారు. స్థానిక ఉదయ మెమోరియల్ హైస్కూల్‌లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ఆంగ్లం, గణిత, భౌతిక, జీవశాస్త్రంకు సంబంధించి తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే తరగతుల్లో అల్పాహారం అందజేస్తామన్నారు. ఆసక్తి గల తెలుగు, ఇంగ్లీష్‌మీడియం విద్యార్థులు ఈనెల 23లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 40రోజుల పాటు కొనసాగే శిక్షణకు 9440145404, 9885799900 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులకు ఉచిత ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, ఎంసెట్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి పాండు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27లోగా ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను కలెక్టరేట్‌లోని రూంనంబర్ 105లో సమర్పించాలని సూచించారు.

చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సుజాతపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న సిబ్బందిని ఆమె వేధిస్తున్నారని, విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. రాము, పవన్, లక్ష్మణ్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశ పూర్వకంగా ఆరోపణలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పై కొందరు ఒప్పంద అధ్యాపకులు ఉద్దేశ పూర్వకంగా ఆరోపణలు చేస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని గోర్‌సేన సంఘం నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమెను ఇబ్బందులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కారణమైన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఛత్రపతి నాయక్, చందు, చవాన్, రవినాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల మద్దతు బీజేపీకే

కోయిల్‌కొండ: రాష్ట్రంలో మాదిగల మద్దతు బీజేపీకే ఉంటుందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాయకులు బాలరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఉత్సవాలు

జడ్చర్ల: నెక్కొండలో ఈనెల 26 నుంచి 28 వరకు శ్రీ మహా గణపతి, శివాంజనేయ, నందీశ్వర, నవగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్ఠ తదితర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు సోమవారం వివరాలను తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

నవాబుపేట: ఎన్నికల నిబంధనలు పాటించాలని లేనిచో చర్యలు తప్పవని తహసీల్దార్ నాన్యనాయక్, ఎస్ఐ అభిషేక్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మాట్లాడుతూ రాజకీయ పార్టీలు నిబంధనల ప్రకారం వాహనాలు వాడాలన్నారు. అలాగే ఆధారాలు లేని నగదును నిబంధనలకు మించి తీసుకుని వెళ్తే సీజ్ చేస్తామన్నారు.

నేడు సమావేశం

మిడ్జిల్: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన మిడ్జిల్, ఊర్కొండ ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ సుదర్శన్, మండల అధ్యక్షుడు పాండు యాదవ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి హాజరవుతారని తెలిపారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పేద ప్రజల కోసం పోరాటం చేస్తున్న వారిని బూటకపు ఎన్‌కౌంటర్లతో హత మార్చడం ప్రజాస్వామ్యంలో సరికాదని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాంటివాటిని ఖండించాల్సిన అవసరముందన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

బాలానగర్: ఉడిత్యాలలో ఓ వెంచర్ నిర్వాహకులు ప్రభుత్వ సర్వే నంబర్ 436 లో ఉన్న 0.09 గుంటల భూమిని ఆక్రమిస్తున్నారని గ్రామానికి చెందిన యువకులు తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. విషయంపై ఆయన మాట్లాడుతూ భూమి ఆక్రమించి వెంచర్ ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం సర్వేయర్‌తో ఆర్ఐ సమక్షంలో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని అన్నారు.









బడులకు సెలవు.. బస్సులు కరువు



పాఠశాలలకు సెలవులు రావడంతో విద్యార్థులు సోమవారం హాస్టళ్ల నుంచి సొంత గ్రామాలకు పెట్టెలు, బ్యాగులతో బయలుదేరారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఇటు విద్యార్థులు, అటు ప్రయాణికుల రద్దీతో బస్సులు ఎక్కడానికి పోటీపడ్డారు. కాగా సరిపడా బస్సులు లేక.. సమయానికి రాక విద్యార్థులు వారి తల్లిదండ్రులు తమ లగేజీతో వేచిచూస్తూ ప్రయాసపడ్డారు.

– సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

ఎక్కడికక్కడే సమస్యలు

- పదవీకాలం ముగుస్తున్నా పనులు చేయలేక పోయామంటున్న ఎంపీటీసీలు సభ్యులు



రాజాపూర్ మండల పరిషత్ కార్యాలయం

రాజాపూర్: ప్రజలు తమను ఎన్నుకున్నాక ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకుంటున్న క్రమంలో ఇప్పటికీ పలు కారణాల వల్ల గ్రామాల్లోని పలు సమస్యలను పరిష్కరించలేకపోయామని మండల పరిధిలోని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మంగళవారం తాము పదవిలో ఉండగా జరగబోయే మండల చివరి సర్వసభ్య సమావేశంలో మరోసారి సమస్యలను లేవనెత్తేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలో మొత్తం 8 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. కాగా మండల పరిషత్ నిధులు అనుకున్నంత రాకపోవడంతో సమస్యలను పూర్తి చేయలేక పోయామని చెబుతున్నారు. ముఖ్యంగా రెండు, మూడు గ్రామ పంచాయతీలకు ఒక ఎంపీటీసీ సభ్యుడు ఉండటంతో మండల పరిషత్ నిధులు రూ. లక్ష ఇవ్వడంతో గ్రామంలో ఏం పనిచేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని.. ఆ నిధులు ఏ పనికీ సరిపోలేదని చెబుతున్నారు.

రేషన్‌షాప్ ఏర్పాటు చేయలేదు



రంగారెడ్డిగూడ పంచాయతీ అనుబంధ గ్రామాలుగా ఉన్న మా తండాలు కొత్తగా సింగమ్మగూడ పంచాయతీగా ఏర్పాటు అయ్యింది. కాగా రంగారెడ్డిగూడలో ఉన్న రేషన్‌షాప్‌కు తండాల నుంచి వెళ్లాలంటే ఇబ్బందులు ఉన్నాయి. విషయంపై మాట్లాడుతూ రేషన్‌షాప్ ఏర్పాటు చేయాలని, తండాలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభాల సమస్య, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం, పొట్లపల్లి నుంచి రాజాపూర్ వరకు బీటీరోడ్డు ఇలా సమస్యలపై ప్రతి సమావేశంలో విన్నవించినా పరిష్కరించలేదు.

– సునీత, రంగారెడ్డిగూడ ఎంపీటీసీ సభ్యురాలు

పెండింగ్‌లోనే..

ముదిరెడ్డిపల్లి, రాయపల్లి గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో అండర్‌డ్రైన్ పనులు పూర్తి చేశాం. అయితే గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన సమస్యను సమావేశంలో ప్రస్తావిస్తే ఐదింటికిగానూ మూడుచోట్ల పరిష్కరించారు. ఇంకా రెండు పెండింగ్‌లోనే ఉన్నాయి. నిధులుగా ఎక్కువగా ఇవ్వకపోవడంతో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించలేకపోయాం.

– దేవోళ్ల శేఖర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు, ముదిరెడ్డిపల్లి, రాయపల్లి

అభివృద్ధికోసం కృషిచేశాం



తిర్మలాపూర్, ఖానాపూర్ ఎంపీటీసీ సభ్యురాలిగా గెలిచి ఎంపీపీగా అవకాశం రావడంతో అందరి సహకారంతో అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశాం. కానీ పదవీ కాలంలో ఉండగానే మండల పరిషత్ పక్కా భవనం నిర్మించలేక పోయాననే బాధ మిగిలింది.

– సుశీల, ఎంపీపీ, రాజాపూర్ మండలం

‘200 యూనిట్లలోపు బిల్లులు చెల్లించకండి’



ఎంపీటీసీ సభ్యురాలు సుకన్యను పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: పార్లమెంట్ ఎన్నికల్లో డీకే అరుణను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డిని గెలిపిస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అడ్డాకులలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్డాకుల, మూసాపేట, కొత్తకోట మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. అడ్డాకుల ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, పొల్కంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు సుకన్య, ఆల యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్ రెడ్డి, డీసీఎం అసోసియేషన్ నాయకులు మదీనా హైమద్‌లు బీఆర్ఎస్‌ను వీడి ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లులు వస్తే వాటిని ఎవరు చెల్లించవద్దని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జీరో బిల్లులు వస్తాయని, కరెంటోళ్లు ఇబ్బంది పెడితే తానే కట్టవద్దని చెప్పినట్లు చెప్పాలని సూచించారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీని అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీహరి, శెట్టిశేఖర్, జగదీశ్వర్, విజయమోహన్ రెడ్డి, నాగిరెడ్డి, రామన్‌గౌడ్, బగ్గి కృష్ణయ్య, భీమన్న, రాధిక, శకుంతల, భీంరెడ్డి, దశరథ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌టీగౌడ్ తదితరులు ఉన్నారు.

వేరుశనగ క్వింటాలు రూ.6936

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం వేరుశనగకు క్వింటాలు గరిష్ఠంగా రూ.6936, కనిష్ఠంగా రూ.4311 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2262, కనిష్ఠంగా రూ. 1935, ఆముదాలు గరిష్ఠంగా రూ.5580, కనిష్ఠంగా రూ.5162, ధాన్యం ఆర్ఎన్ఆర్ రకం గరిష్ఠంగా రూ.2618, కనిష్ఠంగా రూ.2021, హంస రూ.1916, రాగులు రూ.2909, జొన్నలు గరిష్ఠంగా రూ.4056, కనిష్ఠంగా రూ.4000 , కందులు రూ.10,000, చింతగింజలకు రూ.2429 ధరలు లభించాయి.

సోనామసూరి ధర రూ. 2409

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 2409, కనిష్ఠంగా రూ. 1900 గా ధరలు నమోదయ్యాయి. హంస ధాన్యం ధర సరాసరిగా రూ. 1951, ఆముదాలు సరాసరిగా రూ. 5506 గా ధరలు లభించాయి. మార్కెట్‌కు దాదాపు 6 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

పాలమూరు భవిష్యత్‌కు ధోకా లేదు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజల ఆశీస్సులు తోడైతే పాలమూరు భవిష్యత్‌కు ధోకాలేదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం దివిటిపల్లి డబుల్‌బెడ్‌రూంకు చెందిన బ్రాహ్మణులు, పూజారులు ఎమ్మెల్యే యెన్నం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ క్షేమంగా ఉండాలని ఆకాంక్షించే మీరు మాకు తోడుగా కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. మీ చేరిక కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని, శక్తిని అందిస్తుందన్నారు. భవిష్యత్‌లో మీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ చేరికల కమిటీ చైర్మన్ చంద్రకుమార్‌గౌడ్, నాయకులు ఏపీ. మిథున్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, జె.చంద్రశేఖర్, అజ్మత్‌అలీ, మల్లు నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



బాలానగర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీడబ్ల్యూఓ జరీనాబేగం పాల్గొని చిన్నారులకు మెడల్స్ అందజేశారు. సీడీపీఓ మేహరున్నీస, సూపర్‌వైజర్స్ సునీత, అనిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని జిల్లా పరిషత్ స్కూళ్లలో పని చేస్తున్న స్వీపర్లకు ఇవ్వాల్సిన జీతాలను వెంటనే విడుదల చేయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చెంద్రాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

ఘనంగా లెనిన్‌కు నివాళి

మహబూబ్‌నగర్ రూరల్: దివిటిపల్లి డబుల్‌బెడ్‌రూంల కాలనీలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో లెనిన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోహన్, రాజ్‌కుమార్, సయ్యద్ జహంగీర్, ఇంతియాజ్, హుస్సేన్, వెంకటేష్, సాధిక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా పోరాడుదాం



మాట్లాడుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుదామని పలువురు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న సాయంత్రం 4 గంటలకు స్థానిక ఎంబీసీ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభలో ప్రొఫెసర్లు యోగేంద్రయాదవ్, కోదండరాం, హరగోపాల్, కాశీంలతోపాటు ఆమేర్ అలీఖాన్, మౌలానా సాబేర్, ఐపీ ఆశీర్వాదం, దాసురాం నాయక్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. బీజేపీ ఎంపీ స్థాయి నాయకులు అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటనలు చేస్తున్నారని, ఈ పదేళ్ల బీజేపీ పాలనలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పరిపాలన కొనసాగించిందన్నారు. సభలో సబ్బండ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కన్వీనర్ వన్నాడ అంజన్న, కోకన్వీనర్లు ఎస్ఎం.ఖలీల్, వి.రవినాయక్, కాశపోగు ప్రసాద్, జాకీర్ హుస్సేన్, నిజాముద్దీన్, విజయ్‌కుమార్, ఛత్రపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంలో 17 శాతం తేమ ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

దేవరకద్ర: రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చే ధాన్యంలో 17 శాతం తేమ ఉండాలని అంతకంటే ఎక్కువగా ఉంటే మద్దతు ధర రాదని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్ తెలిపారు. సోమవారం దేవరకద్ర మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంతో పాటు పెద్దరాజమూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్, మార్కెట్ సెక్రటరీ జయలక్ష్మి పాల్గొన్నారు.

‘పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గ్రామపంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్ఓ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి మూడు నెలలైనా తిరిగి ఎన్నికలపై దృష్టి పెట్టకపోవడం తగదన్నారు. దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక గ్రామీణులు ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. బీసీ సేన నాయకులు గొడుగు నరసింహులు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

భూత్పూర్: మున్సిపాలిటీలోని చౌరస్తాలో సోమవారం ఓటు హక్కు వినియోగంపై కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అభ్యర్థుల ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి చేసే వారిని గెలిపించుకోవాలని సూచించారు. కమిషనర్ సురేందర్‌రెడ్డి, మేనేజర్ అశోక్ రెడ్డి, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, సిబ్బంది, సఫాయిలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రాజయ్య

జడ్చర్ల టౌన్: ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య కూడళ్లలో సెల్ఫీస్టిక్స్‌తో కమిషనర్ రాజయ్య ఓటర్లకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఓటర్లను సెల్ఫి దిగేలా ప్రోత్సహించారు. నేతాజీ చౌక్, ఇందిరాగాంధీ, గాంధి చౌరస్తా, ఫ్లెక్టివర్‌లలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ధరిత్రిని నిర్మిద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ

జడ్చర్ల టౌన్: ప్లాస్టిక్ రహిత ధరిత్రిని నిర్మించటంతో ప్రతి ఒక్కరం భాగస్వాములమవుదామని స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం పురస్కరించుకుని కళాశాల వృక్షశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్లు 1, 2, 3, 4 యూనిట్లు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. మానవాళికి ఆధారమైన ధరణిని మానవుడు స్వలాభం కోసం నాశనం చేస్తున్నారని వివరించారు. రాబోవు తరాలకోసం భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వృక్షశాస్త్ర విభాగం అధిపతి శ్రీనివాసులు, అధ్యాపకుడు డా. సదాశివయ్య పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఓయూ రిటైర్డ్ అధ్యాపకులు పురుషోత్తం రెడ్డి హాజరై ప్రసంగించారు. ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, అధ్యాపకులు అమీనా ముంతాజ్, సుధీర్, శ్రీవాణి, శ్వేతారాణి, త్రివేణి పాల్గొన్నారు.

పోలీసు బలగాల కవాతు

మహమ్మదాబాద్: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంతో బాటు అన్ని గ్రామాలకు ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. దీంతో సోమవారం మండల కేంద్రంలో సాయంత్రం ఏఆర్ అడిషనల్ ఎస్పీ సురేష్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పరిశోధన పద్ధతులపై వర్క్‌షాప్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం పరిశోధన పద్ధతి, ప్రాజెక్టు నివేదిక అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అధ్యాపకులు ప్రశాంతత్మ హాజరై ప్రసంగించారు. విద్యార్థులు పరిశోధనలను నిజ జీవితానికి అన్వయించుకోవాల్సిన అవసరం ఉందని, చదువులతో పాటు మంచి వ్యక్తిత్వం అవమని, దాన్ని పెంపొందించుకుంటే ఆలోచనలో పరిపక్వత వస్తుందన్నారు. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యరంగంలో వస్తున్న మార్పులను గమనించాల్సిన అవసరం ఉందని, వాటికి అనుగుణంగా విద్యార్థులు భవిష్యత్ ఆలోచనలు ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ రాజ్‌కుమార్, అనురాధారెడ్డి, రంగప్ప, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

చిన్నచింతకుంట: కురుమూర్తి గ్రామంలో బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాము, నరసింహ యాదవ్, కిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

హన్వాడ: మండలకేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఇన్‌చార్జ్ కొండ లింగన్న, బూత్ అధ్యక్షుడు శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి కోస్గి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో గాజులపేటలో ప్రచారం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు మున్నయ్య, బాలుసాగర్, వెంకటయ్య, పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని ఎంపీ అభ్యర్థి డీకె అరుణ అన్నారు. సోమవారం మండలంలోని మల్కాపూర్, పారుపల్లి, అంకిళ్ళ, వింజామూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు రతంగ్‌పాండురెడ్డి, శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



బెంచీల వితరణ

నవాబుపేట: మండల పరిధిలోని లింగంపల్లి జెడ్పీ పాఠశాలకు పూర్వ విద్యార్థులు, దాతలు సోమవారం రెండు తరగతుల విద్యార్థులకు సరిపడ బెంచీలు అందించారు. ఈ సందర్భంగా దాతలను మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ అభినందించారు.

గెలుపు కోసం కృషిచేయాలి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని అమ్మపురం ఎన్నికల ఇన్‌చార్జ్ విజయ్ సారథి రెడ్డి అన్నారు. ఇన్‌చార్జ్‌గా ఆయన నియమితులు కావడంతో గ్రామ నాయకులు ఘనంగా సన్మానించారు. దామోదర్, మాసన్న, దశరథ్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

బాలానగర్: పెద్దరేవల్లికి చెందిన కొండకళ్ల కుమార్‌కు చెందిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ. లక్ష ఉంటుందని బాధితుడు ఈ సందర్భంగా వాపోయాడు. ఘటనపై గ్రామస్తులు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు కుమార్‌ను ఆదుకోవాలని కోరారు.

మద్యం పట్టివేత

మహమ్మదాబాద్: మండల పరిధిలోని నంచర్లకి చెందిన ఓవ్యక్తి మహమ్మదాబాద్ వైన్స్ దుకాణం నుంచి పది ఫుల్ బాటిళ్ల మద్యం తీసుకుని వెళ్తుండగా.. క్రాస్‌రోడ్డు సమీపంలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఈ మేరకు తనిఖీల అధికారి మహేశ్ మద్యంతో పాటు సదరు వ్యక్తిని పోలీసులకు అప్పగించగా కేసునమోదు చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుల్ నజీర్ తదితరులు ఉన్నారు.

‘44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి’



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మోహన్ 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మేడేకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని, మేడేను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాల కోసం నిరంతరం పోరాటం చేసిన సంఘం తమదేనన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించిన ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పాలమూరు: తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో 138వ మేడే ఉత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పబ్లిక్ హెల్త్ సెక్టార్‌లో పని చేస్తున్న సంఘటిత, కాంట్రాక్ట్, అవుట్ సో ర్సింగ్ వేతన జీవుల వెతలు తీర్చాల్సిన అవసరం ఉందన్నారు. సురేష్, ఆంజనేయ లు, కోటేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్ పాల్గొన్నారు.